

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

అన్నపురెడ్డిపల్లిలో శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో సోమవారం స్వామివారి కల్యాణం నిర్వహించారు. 8లో



ఏమార్చి.. నగదు కాజేస్తారు

జిల్లాలో ఆర్థిక నేరాలు పెరిగిపోతున్నాయి. దీనిపై పోలీసులు దృష్టి పెట్టినా మోసగాళ్లు ప్రజలను మాయ చేస్తూనే ఉన్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
38° / 22°

వాతావరణం

జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా నమోదవుతాయి. గంట గంటకూ ఎండ పెరుగుతూ ఉంటుంది.

ఇఫ్తార్ (మంగళవారం సా.) 6.27
సహర్ (బుధవారం ఉ.) 4.46
రంజాన్ వేళలు

కల్యాణ క్రతువు షురూ..



మిథిలా స్టేడియంలో తలంబ్రాలు కలుపుతున్న భక్తులు



వసంతాలతో శ్రీ సీతాలక్ష్మణ సమేతరామచంద్రమూర్తి

భద్రాద్రి రామయ్యకు పెళ్లి కళ

- సంప్రదాయబద్ధంగా పసుపు దంచే వేడుక
- స్వామివారికి వైభవంగా వసంతోత్సవం, డోలోత్సవం
- భారీగా హాజరైన భక్తులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణోత్సవ క్రతువు సోమవారం వైభవంగా ప్రారంభమైంది. ప్రతీ జంటకు ఆదర్శంగా నిలిచే కల్యాణ రాముడి పెళ్లికి మహిళలు సంప్రదాయ బద్ధంగా పసుపు కొమ్ములు దంచి శ్రీకారం చుట్టారు. దీంతో పాటు ఏక కాలంలో వసంతోత్సవం, డోలోత్సవం నిర్వహించడంతో మిథిలా స్టేడియం, దేవస్థానంలో సంబరాలు అంబరాన్నంటాయి. వసంతాలు చల్లుకున్న శ్రీ సీతారాములు పెళ్లి జంటగా దర్శనమివ్వడంతో భక్తులు ఆనందోత్సాహాలతో పరవశించారు.

వేడుకగా తలంబ్రాల తయారీ..

ప్రతీ సంవత్సరం ఫాల్గుణ పౌర్ణమి రోజున పసుపు కొమ్ములను దంచి, తలంబ్రాల తయారీతో రామయ్య పెళ్లి పనులకు శ్రీకారం చుట్టడం ఆనవాయితీ. గతంలో చిత్రకూట మండపంలో ఈ వేడుక నిర్వహించగా.. ఈఓ రమాదేవి గతేడాది మిథిలా స్టేడియం ఎదురుగా ఉన్న ఉత్తర ద్వారం వద్దకు మార్చారు. ఈ సంవత్సరం కూడా అక్కడే జరిపించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాల నడుమ పల్లకీ సేవగా స్వామివారి ఉత్సవ మూర్తులను ఉత్తర ద్వారం వద్దకు తీసుకొచ్చి ఆశీనులు చేశారు. అర్చకులు స్వామివారికి, రోళ్లు, రోకళ్లకు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు, అర్చకుల సతీమణులతో పాటు ఆలయ ఈఓ రమాదేవి తొలుత పసుపు కొమ్ములు దంచి పెళ్లి పనులు ప్రారంభించారు. అనంతరం బియ్యంలో పసుపు, రోజ్‌వాటర్, గులాల్, సుగంధ ద్రవ్యాలు, అత్తర్ వేసి తలంబ్రాలు కలిపారు. వాటిని స్వామివారి మూలమూర్తుల పాదాల చెంతన ఉంచారు. సోమవారం హోలీ సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఇక ఈ వేడుకలు మిథిలా స్టేడియం ఎదుట నిర్వహించడంతో అందరూ కనులారా వీక్షించేందుకు వీలు కలిగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు గోటితో ఒలిచి తీసుకొచ్చిన కోటి తలంబ్రాలను స్వామి వారికి సమర్పించారు.

స్వామివారిపై వసంతం చల్లి..

ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ సీతారాములకు వసంతోత్సవం, డోలోత్సవం నిర్వహించడం ఆలయంలో ఆనవాయితీ. ఈ క్రమంలో బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు పంచామృతాలతో కలశాభిషేకం, సహస్రధారతో స్నపనం జరిపించారు. ప్రత్యేకంగా అలంకరించిన ఊయలపై శ్రీ సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్యను ఆశీనులను చేశారు. ఆస్థాన గాయకులు రామదాసు కీర్తనలను ఆలపిస్తుండగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారికి నక్షత్ర హారతి సమర్పించారు. అర్చకులు శ్రీ సీతారాముల ఉత్సవ విగ్రహాలపై రంగులు చల్లి వసంతోత్సవాన్ని ప్రారంభించారు. పంచరంగుల వసంతాలు పడడంతో శ్రీ సీతారాములకు కల్యాణ శోభ సంతరించుకుంది. అనంతరం అర్చకులు సిబ్బంది, భక్తులపై రంగులు చల్లారు. ఈ సందర్భంగా బేడా మండపం రంగులమయంగా మారింది. భారీగా తరలివచ్చిన భక్తుల రామనామ స్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.



ఉత్తర ద్వారం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు



పసుపు కొమ్ములు దంచుతున్న ఈఓ, భక్తులు

సామూహిక లక్ష్మీ పూజలు

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో సోమవారం సామూహిక లక్ష్మీ పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థానం, శ్రీ లక్ష్మీ మహిళా సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని జరిపించగా.. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. పూజలో పాల్గొన్న భక్తులకు లక్ష్మీ అమ్మవారి వెండి ప్రతిమ, జాకెట్ పీస్, కుంకుమ, ప్రసాదాలను అందజేశారు.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లి ఆలయంలో చండీహోమం



చండీ హోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో సోమవారం పౌర్ణమిని పురస్కరించుకుని వైభవంగా చండీ హోమం నిర్వహించారు. ముందుగా మేళతాళాలు, అర్చకుల వేదమంత్రాలతో ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం యాగశాలలో మండపారాధన, గణపతి పూజ అనంతరం హోమం, చివరకు పూర్ణాహుతి నిర్వహించారు. చండీహోమంలో పాల్గొన్న 23 మంది భక్త దంపతులకు అర్చకులు అమ్మవారి శేష వస్త్ర ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ జి.సుదర్శన్, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ఎంపికకు నేడు, రేపు పోటీలు

పాల్వంచరూరల్: ఉమ్మడి జిల్లాలోని క్రీడాపాఠశాలల్లో విద్యార్థుల ఎంపికకు మంగళ, బుధవారాల్లో తుది పోటీలు నిర్వహించనున్నట్లు క్రీడల అధికారి బొల్లి గోపాల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. కిన్నెరసానిలోని బాలుర, కాచనపల్లిలోని బాలికల క్రీడాపాఠశాల్లో ఐదో తరగతిలో ప్రవేశాలు కల్పించేందుకు ఈనెల 5, 6 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు 26, 27వ తేదీల్లో చివరి దశ పోటీలు నిర్వహించనున్నారు. ఈమేరకు బ్యాటరీ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను మంగళవారం ఉదయం 8 గంటలకల్లా కిన్నెరసాని క్రీడాపాఠశాలకు తీసుకురావాలని, వివరాలకు 96185 15907, 99123 62053 నంబర్లలో సంప్రదించాలని గోపాల్‌రావు సూచించారు.

నేత్రపర్వం.. రాధాకృష్ణుల కల్యాణం



రాధాకృష్ణుల కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

ఇల్లెందురూరల్: హోలీ పండుగను పురస్కరించుకుని మండలంలోని కొమరారంలో రాధాకృష్ణుల కల్యాణ వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణుల ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో గ్రామంలో ఊరేగించారు. కల్యాణ వేడుకలను తిలకించేందుకు పలు గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణ ఘట్టాన్ని పూర్తి చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకున్నామని ఉత్సవ కమిటీ ప్రతినిధి, ఆలయ ప్రధాన పూజారి కోరం కోటమ్మ తెలిపారు.

కిన్నెరసానిలో హోలీ సందడి!



స్పీడ్‌బోటుపై షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన మండలంలోని కిన్నెరసానిలో సోమవారం హోలీ పర్వదినం సందర్భంగా సందడి నెలకొంది. జిల్లా నలుమూలల నుంచే కాక పొరుగు జిల్లాల నుంచి సైతం పర్యాటకులు కుటుంబాలతో కిన్నెరసానికి వచ్చారు. ఈసందర్భంగా డ్యామ్ పైనుంచి జలాశయం, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించిన వారు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. ఈమేరకు 382 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖ రూ.11,045, 220మంది బోట్‌షికారు చేయడంతో టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.10,120 ఆదాయం లభించిందని నిర్వాహకులు తెలిపారు.

కూడలిలో కా(మ్రే)డ్స్!

- స్నేహంపై 'హస్తం' స్పందన కరువు
- ఒక్క ఎంపీ సీటైనా ఇవ్వాలని సీపీఐ ప్రతిపాదన
- పార్టీ కోరిన ఐదు స్థానాల్లో రెండు చోట్ల కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన
- మరోవైపు భువనగిరిలో అభ్యర్థిని ప్రకటించిన సీపీఎం

సాక్షి ప్రతినిధి, ఖమ్మం : రాష్ట్రంలో ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో పట్టున్న సీపీఎం, సీపీఐ పార్లమెంట్ ఎన్నికల్లో పొత్తు కోసం వేచిచూస్తున్నాయి. కాంగ్రెస్ స్నేహహస్తం కోసం ఎదురుచూస్తున్నాయి. అయితే ఆ పార్టీల ప్రతిపాదనపై ఇప్పటివరకు కాంగ్రెస్ స్పందించకపోవడంతో కామ్రేడ్స్ అసహనంతో ఉన్నట్లు తెలుస్తోంది. సీపీఎం ఇప్పటికే భువనగిరి అభ్యర్థిని ప్రకటించడమే కాక మిగతా స్థానాల్లో ఎలా ముందుకెళ్లాలన్న అంశంపై సమాలోచనలు చేస్తోంది. సీపీఐ మాత్రం దేశవ్యాప్తంగా ఇండియా కూటమిలో ఉన్నందున రాష్ట్రంలో ఒక్క ఎంపీ స్థానమైనా తమకు ఇవ్వాలని పట్టుబడుతోంది. ఆ దిశగా కాంగ్రెస్ చర్చలకు పిలవకపోవడంతో ఈనెలాఖరు నాటికి ఒక నిర్ణయం తీసుకునే అవకాశముంది.

సీపీఎం ముందస్తు అడుగులు

ఇండియా కూటమిలో భాగంగా రాష్ట్రంలో పట్టున్న ప్రాంతాల్లో తాము పోటీ చేస్తామని సీపీఎం చేసిన ప్రతిపాదనపై కాంగ్రెస్ నుంచి నిర్ణయం వెలువడలేదు. దీంతో ఆ పార్టీ భువనగిరి లోక్‌సభ స్థానంలో తమ అభ్యర్థిగా జహంగీర్‌ను ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా సీపీఎం తొలుత బీఆర్‌ఎస్‌తో.. ఆ తర్వాత కాంగ్రెస్‌తో పొత్తుకు సై అన్నా కుదరలేదు. ఇక లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ నుంచి స్పందన రాకపోవడంతో భువనగిరిలో పార్టీ అభ్యర్థిని ప్రకటించి ముందడుగు వేసింది. సీపీఎం ప్రతిపాదించిన పార్లమెంట్ స్థానాల్లో ఖమ్మం కూడా ఉండగా.. ఇక్కడ కూడా పోటీ చేస్తుందా.. ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తుందా.. అన్న అంశంపై ఈనెల 31న జరిగే రాష్ట్ర కమిటీ భేటీలో నిర్ణయించనున్నట్లు తెలిసింది.

వేచిచూసే ధోరణిలో సీపీఐ

అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంది. రాష్ట్రంలో నాలుగైదు స్థానాల్లో పోటీకి సిద్ధమైనా, కొత్తగూడేనికే పరిమితమైంది. ఈ స్థానం నుంచి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పోటీకి దిగి గెలిచారు. ఇక పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం, భువనగిరి, వరంగల్, నల్లగొండ, పెద్దపల్లి స్థానాల్లో పోటీ చేస్తామని కాంగ్రెస్‌కు ప్రతిపాదించగా.. ఆ పార్టీ స్పందించకపోగా నల్లగొండ, పెద్దపల్లి స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది. ఇక సీపీఐ కోరుతున్న స్థానాల్లో ఖమ్మం, భువనగిరి, వరంగల్ మిగిలి ఉండగా.. తాము అడిగిన స్థానాల్లో ఒక్కటైనా ఇవ్వకపోతే ఎలా అంటూ ఇటీవల సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అసహనం వ్యక్తం చేశారు. తాజాగా జరిగిన పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశంలోనూ పోటీపై చర్చ జరిగినట్లు సమాచారం. ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్నందున సీపీఐ జాతీయ నాయకత్వం ఇచ్చే సూచనలతో ముందుకు వెళ్లాలనే భావనతో ఆ పార్టీ నేతలు ఉన్నట్లు తెలుస్తోంది.

ఎవరి ప్రభావం ఎంత ?

గత పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఎం, సీపీఐ కలిసి పోటీ చేశాయి. సీపీఎం నల్లగొండ, ఖమ్మం స్థానాల్లో.. సీపీఐ మహబూబాబాద్, భువనగిరిలో పోటీ చేసినా ఫలితం దక్కలేదు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం ఉమ్మడి జిల్లాలో ఒంటరిగా, సీపీఐ కాంగ్రెస్‌తో జత కట్టాయి. ఆ ఎన్నికల్లో నమోదైన ఓట్ల ఆధారంగా పార్లమెంట్ ఎన్నికల్లో ఈ పార్టీల ప్రభావం ఎంత మేరకు ఉంటుందన్న అంశంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఓ వైపు కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ అభ్యర్థిని ప్రకటించగా.. నేడో, రేపో ఖమ్మం అభ్యర్థిని కూడా ప్రకటించే అవకాశముంది. దీంతో సీపీఎం ఒక్క భువనగిరి స్థానానికే పరిమితవుతుందా, ఖమ్మంలోనూ పోటీ చేస్తుందా అన్నది తేలాల్సి ఉంది. పోటీలో ఆ పార్టీ అభ్యర్థిని పెట్టకపోతే కాంగ్రెస్‌కు ఎన్ని ఓట్లు కలిసొస్తాయన్న చర్చ జరుగుతోంది. ఇక సీపీఐ నేతలు జాతీయ నాయకత్వం నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో ఒక్క స్థానంలోనైనా పోటీ చేయకపోతే కేడర్ బలహీనమవుతుందన్న ఆలోచనలో నేతలు ఉన్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా బీజేపీని నిలువరించడమే లక్ష్యంగా తమ అడుగులు ఉంటాయని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

సారపాకే.. ప్రత్యామ్నాయం

- భద్రాద్రి భక్తుల వసతులకు ఏకైక మార్గం
- అందుబాటులో వందల ఎకరాల ప్రభుత్వ భూమి
- అయినా పట్టించుకోని అధికార యంత్రాంగం
- వైఎస్ హయాంలో కాటేజీల నిర్మాణానికి భూసేకరణ



సారపాకలోని ప్రధాన కూడలి ఇదే..

బూర్గంపాడు: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి రామయ్య భక్తులకు సరిపడా వసతులు కరువయ్యాయి. ముక్కోటి, శ్రీరామనవమి, పట్టాభిషేకం సమయాల్లో వేలాది మంది భక్తులు రామయ్య దర్శనానికి వస్తుంటారు. అయితే వారు బస చేసేందుకు సరిపడా వసతిగృహాలు, కాటేజీలు లేక ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్ర విభజన తర్వాత భద్రాచలం పట్టణం మినహా చుట్టుపక్కల గ్రామాలన్నీ ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేశారు. దీంతో ప్రైవేటు లాడ్జీలు, వసతిగృహాల నిర్మాణానికి వీలు కలగడం లేదు. భద్రాచలానికి సమీపంలోని పురుషోత్తపట్నంలో రామాలయ భూములున్నా.. ఆ గ్రామంలో ఏపీలోకి వెళ్లింది. ఈ పరిస్థితుల్లో రామ భక్తులకు చేరువలో వసతులు కల్పించాలంటే ఉన్న ఏకైక మార్గం సారపాక మాత్రమే. ఇక్కడ వందల ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. ఈ భూముల్లో కాటేజీలు, వసతి గృహాలు నిర్మిస్తే భక్తులకు సౌకర్యంతో పాటు ప్రభుత్వానికీ ఆదాయం వస్తుంది. అయితే ఈ దిశగా పాలకులు, అధికారులు అడుగులు వేయడం లేదు. 2015 గోదావరి పుష్కరాల సమయంలో భద్రాచలం వచ్చే భక్తుల వాహనాలకు సారపాకలోనే వందల ఎకరాల్లో పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేశారు. దీంతో 12 రోజుల పాటు సాగిన గోదావరి పుష్కరాల్లో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగ లేదు. ఇలాంటి సానుకూల అనుభవాలు పరిగణనలోకి తీసుకుంటే భద్రాద్రి భక్తులకు మరింత సౌకర్యవంతమైన వసతులు కల్పించే అవకాశం ఉంటుంది.

ఇకనైనా దృష్టి పెట్టాలంటున్న భక్తులు..

సారపాకలో సర్వే నంబర్ 262లో వందల ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. ఇదే సర్వే నంబర్‌లో రెవెన్యూ, అటవీ శాఖ భూములున్నాయి. మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు హయాంలో 262 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని భద్రాచలం పేపర్‌బోర్డు నిర్మాణానికి కేటాయించారు. పేపర్‌బోర్డు నిర్మాణంతో సారపాక పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. ఈ సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూముల్లోనే కార్మిక వాడలు కూడా నిర్మించారు. అయినా ఇంకా ప్రభుత్వ భూమి చాలానే ఉంది. తాళ్లగొమ్మూరు, కోయగూడెం ప్రాంతంలోని గుట్టల వద్ద, భాస్కర్‌నగర్, గాంధీనగర్ గుట్టల వద్ద సర్కారు భూములున్నాయి. కొంతమేర భూములను రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేశారు. ఇక నియోజకవర్గాలు వేరైనా సారపాక, భద్రాచలం ఒకటిగానే స్థానికులు భావిస్తున్నారు. రెండింటి మధ్య 1.5 కిలో మీటర్ల దూరంలో బ్రిడ్జి ఉంది. భద్రాచలం వచ్చే ప్రముఖులంతా సారపాక ఐటీసీ గెస్ట్‌హౌస్‌లోనే బస చేస్తారు. సామాన్య భక్తులకు మాత్రం ఈ పరిస్థితి లేదు. భద్రాచలంలో ఉన్న దేవాదాయ శాఖ వసతి గృహాలు, సత్రాలు, ప్రైవేటు లాడ్జీలు సామాన్య భక్తులకు సరిపోవడం లేదు. రైలు మార్గంలో భద్రాచలం వచ్చే భక్తులు కొత్తగూడెం, పాల్వంచ లాడ్జిల్లో బసచేసి రామయ్య దర్శనానికి రావాల్సి వస్తోంది. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు రెండు, మూడు రోజులు ఇక్కడే ఉండి పర్ణశాల, పాపికొండలు సందర్శనకు వెళ్తుంటారు. ఇలాంటి వారందరికీ సారపాక ప్రభుత్వ భూముల్లో కాటేజీలు, వసతిగృహాలు నిర్మిస్తే సౌకర్యవంతంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయమై అధికారులు, పాలకులు దృష్టి పెట్టాలని రామయ్య భక్తులు కోరుతున్నారు.

వైఎస్ హయాంలో ప్రతిపాదనలు..

రాష్ట్ర విభజనకు ముందే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో గోదావరికి ఇవతల ఒడ్డున సారపాకలో కాటేజీలు నిర్మించాలని నిర్ణయించారు. ఆయన ఆదేశాలతో సారపాక బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు పక్కనున్న 36 ఎకరాల రైతుల భూముల్లో నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. భూ సేకరణకు అధికారులు కసరత్తు చేయగా రైతులు భూములు ఇచ్చేందుకు నిరాకరించి ఒకటి, రెండు సార్లు ఆందోళనకు కూడా దిగారు. అయితే అధికారులు వారితో మాట్లాడి భూములకు నష్ట పరిహారంతో పాటుగా ప్రత్యామ్నాయ భూములు చూపుతామని హామీ ఇవ్వడంతో అంగీకరించారు. ఈలోగా వైఎస్ మరణంతో ఆ ప్రక్రియ అటకెక్కింది. నాటి నుంచి ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం కూడా ఆ దిశగా ఆలోచన చేయలేదు. రాష్ట్ర విభజన తర్వాత భద్రాచలంలో కొత్తగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టేందుకు వీల్లేని పరిస్థితి నెలకొంది. అయితే భద్రాద్రికి కేవలం రెండు కిలోమీటర్ల దూరంలోని సారపాకలో వందల ఎకరాల ప్రభుత్వ భూములున్నా వాటిని వినియోగించుకునే దిశగా అధికారులు, పాలకులు ఆలోచించకపోవడం గమనార్హం.

హోలీ.. రంగేళి..

రంగుల పండుగ హోలీని జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. పలువురు అధికారులు, యువత, చిన్నారులు, మహిళలు వయోభేదం లేకుండా రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. కలెక్టర్ ప్రియాంక ఆల తన క్యాంప్ కార్యాలయంలో అధికారులు, చిన్నారులతో కలిసి వేడుకలు జరుపుకున్నారు. పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ రోహిత్ రాజు అధికారులతో కలిసి నృత్యాలు చేశారు. భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో పీఓ ప్రతీక్‌జైన్ సిబ్బందితో కలిసి దాండియా ఆడారు. – నెట్‌వర్క్



కలెక్టర్‌కు రంగులు పూస్తున్న డీడబ్ల్యూఓ విజేత



పీఓ ప్రతీక్‌జైన్‌కు రంగు చల్లుతున్న సతీమణి రిచాజైన్



హోలీ వేడుకల్లో ఎస్పీ రోహిత్‌రాజ్

క్లుప్తంగా

బాండ్ల చెల్లింపులో జాప్యంపై విచారణ చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీ కార్మికులకు బాండ్ల చెల్లింపు జాప్యంపై విచారణ జరిపించాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పద్మాకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులకు 2013 వేతన సవరణ బకాయిలకు సంబంధించి బాండ్ల నగదు చెల్లించాలని సీఎం ఆదేశించి 40 రోజులు దాటినా చెల్లించకపోవడం సరికాదని పేర్కొన్నారు. ఆర్టీసీ యాజమాన్యం సైతం ఈనెల 11నుంచి చెల్లింపులు జరపాలని సర్క్యులర్ విడుదల చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇకనైనా స్పందించి ఆర్టీసీ కార్మికుల బాండ్ల నగదు వెంటనే చెల్లించాలని పద్మాకర్ కోరారు.

ముగిసిన రెండు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేలు



ప్రథమ స్థానంలో నిలిచిన ఎడ్ల యజమానికి బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాలెంలో అంకమ్మతల్లి, అక్కమ్మ పేరంటాల రామలింగేశ్వరస్వామి తిరునాళ్ల సందర్భంగా నిర్వహించిన రెండు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేలు సోమవారం ముగిశాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి 20జతల ఎడ్లు పోటీల్లో పాల్గొనగా.. బనిగండ్లపాలేనికి చెందిన తల్లపురెడ్డి అంకాళ్లరెడ్డి ఎడ్లు 2,601 అడుగులు లాగి ప్రథమ బహుమతి రూ.30 వేల నగదు గెలుచుకున్నాయి. అలాగే, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా కంచకచర్లకు చెందిన షేక్ హజ్మీయా, తల్లపురెడ్డి రాంరెడ్డి, మధిరకు చెందిన మోహన్, తాళ్లూరుకు చెందిన నాగేశ్వరావు, తొట్ల ఉట్లూరుకు చెందిన ఆర్‌బీఎస్, జూపూడికి చెందిన వెంకటేశ్వరావు, ఆళ్లూరి నాగేశ్వరరావు, రాఘవాపురానికి చెందిన రాంరెడ్డి, చిన్నపుటికకు చెందిన ఆర్‌వీ బుల్స్ ఆతర్వాత స్థానాల్లో నిలిచాయి. ఆలయ కమిటీ సభ్యులు, దాతలు సాయికుమార్, ఝెన్నం సత్యనారాయణరెడ్డి, నీలం రవికుమార్, శీలం రవీంద్రరెడ్డి, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన వినోద్‌రావు





కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వినోద్‌రావు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం లోక్‌సభ బీజేపీ అభ్యర్థిగా తాండ్ర వినోద్‌రావును ఆదివారం అధిష్టానం ప్రకటించిన విషయం విదితమే. ఈసందర్భంగా ఆయన సోమవారం హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో పాటు మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, వినోద్‌రావుకు టికెట్ ప్రకటించడంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పార్టీ అధిష్టానం సూచన మేరకు ఆయన విజయానికి కలిసికట్టుగా కృషి చేస్తామని తెలిపారు.

బైక్‌కు కారు తగిలిందని వివాదం




ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో సోమవారం రెండు వర్గాల యువత వీరంగం సృష్టించారు. బైక్‌ను కారు తాకడంతో మొదలైన వివాదం తారాస్థాయికి చేరగా, పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. మండల కేంద్రంలోని ఓ దుకాణం వద్ద ఉన్న బైక్‌ను కూసుమంచి మీదుగా వచ్చిన సూర్యాపేటకు చెందిన వారి కారు తాకిందంటూ బైక్‌పై యువకులు వాదనకు దిగారు. ఈ గొడవ పెద్దది కావడంతో అరుపులు, కేకలు, తోపులాటతో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. చివరకు స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు చేరుకుని ఇరువర్గాల వారిని స్టేషన్‌కు తరలించారు.

90 బాటిళ్ల మద్యం సీజ్

ఖమ్మం క్రైం: ఖమ్మం స్టేషన్‌రోడ్డు ప్రాంతంలో అక్రమంగా నిల్వ చేసిన 90 మద్యం బాటిళ్లను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం సోమవారం స్వాధీనం చేసుకుంది. హోలీ పండుగ సందర్భంగా సోమవారం వైన్స్, బార్లను మూసివేయించారు. అయితే, ఓ వైన్స్‌షాప్‌కు సంబంధించిన మద్యాన్ని పక్కన పాన్‌షాప్‌లో ఉంచి విక్రయిస్తున్నారనే సమాచారంతో స్వాధీనం చేసుకున్నట్లు స్క్వాడ్ అధికారులు వెల్లడించారు.


పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,045

ఏమార్చి.. నగదు కాజేస్తారు

- మోసగాళ్ల వలలో చిక్కుకుని నష్టపోతున్న బాధితులు
- గుర్తుతెలియని వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి
- ఫోన్‌లో బ్యాంకు ఖాతా వివరాలు వెల్లడించొద్దు
- కేటుగాళ్లతో జాగ్రత్తగా ఉండాలంటున్న పోలీసులు



ఇల్లెందురూరల్: జిల్లాలో వైట్‌కాలర్ ఆర్థిక నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. బ్యాంకు రుణాలు, ఉద్యోగాలు ఇప్పిస్తామని, బంగారానికి నగిషీ పెడుతామని, చిట్టీలు కట్టించుకుని, అప్పుగా నగదు తీసుకొని ఐపీ పెట్టడం వంటి ఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల తక్కువ వడ్డీకి రుణాలు ఇప్పిస్తామని ఇల్లెందు మండలంలో ఐదురుగు మహిళలకు ఎదురైన మోసం ఆర్థిక నేరాల్లో కొత్త కోణాన్ని వెలుగులోకి తెచ్చింది. అజ్ఞాత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నా మోసగాళ్లు మాత్రం ఏదో ఒక రకంగా మాయమాటలతో బుట్టలో వేసుకుని ఉడాయిస్తున్నారు.

బ్యాంకు రుణాల పేరుతో..

బ్యాంకులో రుణాలు మంజూరు చేస్తామని అజ్ఞాత వ్యక్తుల నుంచి ఫోన్లు వస్తుంటాయి. బోగస్ ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధిగా పేరు చెప్పుకుంటూ బ్యాంకు ఖాతా, పిన్ నంబర్లు తీసుకుని నగదు డ్రా చేసుకుంటున్నారు. ఆయా ఆధారాలతో ఇతర బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి హవాలా రూపంలో నగదు లావాదేవీలు జరుపుతున్నారు.

అధిక వడ్డీలు..

తక్కువ సమయంలో చెల్లించిన నగదుకు వాయిదాల పద్ధతిలో అధిక మొత్తంలో వడ్డీతో తిరిగి చెల్లిస్తామని గతంలో పీషోన్ మార్కెటింగ్ పేరుతో ఇల్లెందు మండలంలోని సుందరయ్యనగర్‌లో ప్రజల నుంచి పెద్ద మొత్తంలో నగదు వసూలు చేసి ఉడాయించిన ఘటనలు ఉన్నాయి. ఇదే తరహాలో పలు పేర్లతో గొలుసుకట్టు చేరికలు ప్రారంభించి చేర్పించిన వారికి పెద్ద మొత్తంలో పర్సంటేజీలు ఆశ చూపి చేరికల సంఖ్య పెంచుకుని, చివరకు పెద్దమొత్తంలో ఉడాయిస్తారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని..

ప్రభుత్వ శాఖ నుంచి ఉద్యోగ ప్రకటన (ముఖ్యంగా జిల్లాలో సింగరేణి సంస్థ నుంచి) వెలువడగానే.. ఉద్యోగాలిప్పిస్తామని కొందరు పనిగట్టుకొని ప్రచారం చేస్తూ పోస్టులను బట్టి ధరలను నిర్ణయించి యువతను బుట్టలో వేసుకోవడానికి యత్నిస్తున్నారు. వంద మంది నుంచి వసూలు చేస్తే అందులో ఏ ఒక్కరికి ఉద్యోగం వచ్చినా అది తమ ప్రతిభ ద్వారానే వచ్చినట్లు చెప్పుకొని డబ్బు నొక్కేసే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లాలో సింగరేణి వారసత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామన్న మోసగాళ్ల మాయ మాటలు నమ్మి రూ.3 లక్షల నుంచి రూ.5లక్షల వరకు ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా నేటికీ వారి చుట్టూ ప్రదిక్షణలు చేస్తున్న నిరుద్యోగులు ఉన్నారు. ఇలాంటి వారు ఇల్లెందు, కొత్తగూడెంలో అనేక మంది బహిరంగంగానే ఆరోపణలు చేయడం గమనార్హం.

అనుమతిలేని చిట్టీలతో చేటు

ప్రభుత్వ అనుమతి లేకుండా చిట్టీల వ్యాపారం జోరుగా సాగుతోంది. చిట్టీల పేరుతో వసూలు చేసిన సొమ్ముతో ఉడాయిస్తున్నారు. నిదానంగా ఐపీ పెట్టి దర్జాగా ఇంటికి చేరుతున్నారు. ఇలాంటి వారు ఇల్లెందులో అనేక మంది ఉన్నారు. వీరు కాజేసిన సొమ్ము రూ.కోట్లలోనే ఉంటుంది. బాధితులు పోలీసులను ఆశ్రయించినా నేటికీ ఒక్క రూపాయి కూడా రికవరీ చేయలేకపోయారు. ఇక ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని కొందరు గిరిగిరీ వ్యాపారం చేస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు.

మాటల గారడీకి మోసపోవద్దు



గుర్తు తెలియని వ్యక్తి మాటలను నమ్మొద్దు. అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. బ్యాంకు నుంచి రుణాలు ఇప్పిస్తామంటే నేరుగా మీరే బ్యాంకు వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకోవాలి. ఉద్యోగాలు పెట్టిస్తామనే పైరవీకారుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. కొత్తగా వచ్చిన వారి వద్ద ఎలాంటి అనుమతి లేని చిట్టీలు వేయవద్దు. నెట్ ద్వారా వచ్చే ఫోన్‌లకు ఎలాంటి సమాచారం ఇవ్వవద్దు. ఏటీఎం కార్డుపై ఉన్న నంబర్, బ్యాంక్ ఖాతా నంబర్లు ఎవరికీ చెప్పకూడదు. ఆన్‌లైన్‌లో తక్కువ ధరకే వస్తువులంటూ ఇచ్చే అవాస్తవ ప్రకటనల పట్ల జాగ్రత్తగా ఉండాలి. అజ్ఞాత వ్యక్తుల ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దు.

– కరుణాకర్, స్టేషన్ హౌజ్ ఆఫీసర్, ఇల్లెందు

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



హోమంలో పాల్గొన్న సివిల్ జడ్జి రామారావు దంపతులు

అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లిలో కొలువైన శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలు మూడో రోజు చేరుకోగా, సోమవారం ఆలయంలో స్వామివారికి తెల్లవారుజాము నుంచే సుప్రభాతసేవ, అర్చనలు, గోత్రనామార్చనలు, ధూప దీప నైవేద్యాలు, హోమాలు, నిత్య పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి కావాల్సిన పసుపు దంచే కార్యక్రమం(ఉలవక్కల ఉత్సవం) నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా తలంబ్రాలను కలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని కొత్తగూడెం సివిల్ జడ్జి రామారావు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కాగా శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారి ఆలయంలో చండీ హోమం నిర్వహించారు.

ఘనంగా కల్యాణం

శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. వివిధ రకాల పూలలు, విద్యుత్‌దీపాలతో ఆలయ ప్రాంగణాన్ని అలంకరించగా, అర్చకులు మంగళవాయిద్యాలతో శాస్త్రోక్తంగా కల్యాణ వేడుక జరిపించారు. ఆలయ మేనేజర్ రమణ, భక్తులు మారగాని శ్రీనివాసరావు, వనమా వెంకటేష్ దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు గిరిధరాచార్యులు, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ వనమా గాంధీ, వేముల రమణ, కల్లోజి వెంకటేష్, పర్సా వెంకటేశ్వర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మ వారికి కంఠహారం వితరణ





ఈఓకు బంగారు కంఠహారం అందచేస్తున్న దాతలు (ఇన్‌సెట్) బంగారు నెక్లెస్

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో సీతమ్మ వారికి భక్తులు సోమవారం కంఠహారం(నెక్లెస్) వితరణగా అందచేశారు. భద్రాచలానికి చెందిన విశ్రాంత బ్యాంకు ఉద్యోగి దేశరాజు శంకర్‌రావు, ప్రభుత్వ ఉపాధ్యాయిని రూపశ్రీ దంపతులు సోమవారం సీతమ్మ జన్మనక్షత్రం సందర్భంగా బంగారం కంఠ హారాన్ని ఈఓ రమాదేవికి అందచేశారు. రూ.2,25,000 విలువైన ఈ హారానికి అంతరాలయంలో మూలమూర్తుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వేడుకలో కత్తులతో దాడి

- ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు
- రాష్ట్ర సరిహద్దు ఎటపాకలో ఘటన

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణ సరిహద్దు ఏపీలోని ఎటపాక మండలం వెంకటరెడ్డిపేట గ్రామంలో సోమవారం నిర్వహించిన వెంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవంలో విషాదం చోటుచేసుకుంది. ఉత్సవాల్లో బండిని పక్కకు తప్పించే క్రమంలో జరిగిన ఘర్షణలో ఓ బాలుడు ప్రాణాలు కోల్పోగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. భద్రాచలం పట్టణానికి చెందిన కొందరు యువకులు ఆటోలో వెంకటరెడ్డిపేట గ్రామంలో జరిగే వేడుకలను తిలకించేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ఎటపాక మండలం రామగోపాలపురం తండాకు చెందిన అజ్మీర సాయికుమార్, కొరిమి సాయి, నక్కినపోయిన శ్రీనుకు, భద్రాచలం యువకులకు మధ్య ఘర్షణ జరిగింది. దీంతో భద్రాచలం నుంచి వచ్చిన యువకులు కత్తులతో విచక్షణారహితంగా దాడి చేశారు. దీంతో అజ్మీర సాయికుమార్(15)కు తీవ్ర గాయాలయ్యాయి. భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా చికిత్స పొందుతున్నారు. మృతి చెందిన అజ్మీర సాయికుమార్‌తోపాటు కొరిమి సాయి నెల్లిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతూ గౌరిదేవిపేటలో పరీక్షలు రాస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎటపాక సీఐ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● అల్లాడుతున్న ఆలమంద



నీటి కుంటలో దాహార్తి తీర్చుకుంటున్న పశువులు

ఓ వైపు వేసవి తాపం పెరుగుతోంది. మరోవైపు చెరువులు, నీటి కుంటలు ఎండిపోతున్నాయి. దీంతో గుక్కెడు నీళ్లు దొరకక మూగజీవాలు అల్లాడుతున్నాయి. ఎండ తీవ్రతకు ఎక్కడ నీళ్లు కనిపించినా మూగజీవాలు పరుగులు పెట్టి దాహం తీర్చుకుంటున్నాయి. సోమవారం అశ్వారావుపేట మండలం మేకలబండ గ్రామ అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లిన పశువులు దాహంతో ఒక్కసారిగా నీటికుంట వైపు పరుగులు పెట్టి దాహార్తి తీర్చుకుంటున్న దృశ్యమిది. – అశ్వారావుపేటరూరల్

గల్లంతైన యువకులను కాపాడిన కానిస్టేబుళ్లు



కాపాడిన కానిస్టేబుళ్లతో యువకుడు(ఎడమ)

మణుగూరు టౌన్: పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన ముగ్గురు యువకులు సోమవారం హోలీ ఆడిన అనంతరం శివారు ప్రాంతమైన కొండాయిగూడెం గోదావరిలో స్నానానికి వెళ్లారు. కాలు జారి మునిగిపోతూ కేకలు వేస్తున్న క్రమంలో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ వినయ్, సన్నై గమనించారు. వినయ్ గోదావరిలోకి దూకి వారిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. ఈ సందర్భంగా ధైర్యసాహసాలు ప్రదర్శించి ముగ్గురు యువకుల ప్రాణాలను కాపాడిన కానిస్టేబుళ్లను డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ సతీష్‌కుమార్, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి, మహబూబాబాద్ పార్లమెంట్ యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జి ధనసరి సూర్య, అధికారులు అభినందించారు.

వందనంలో పెద్దపులి కలకలం!

పులి కాదని నిర్ధారించిన అటవీ శాఖాధికారులు



వందనంలో రైతు నుంచి వివరాలు సేకరిస్తున్న అటవీ, పోలీసు ఉద్యోగులు

చింతకాని: మండలంలోని వందనం గ్రామంలో పెద్దపులి తిరుగుతోందన్న ప్రచారం గ్రామస్తులను ఆందోళనకు గురిచేసింది. గ్రామానికి చెందిన కౌలు రైతు గాలీబ్ సాహెబ్ పునికి చెరువు పక్కన గంగమ్మ గుడి వద్ద మొక్కజొన్న సాగుచేశాడు. పంటకు నీళ్లు పెట్టేందుకు సోమవారం ఉదయం వెళ్లిన ఆయనకు పులి మాదిరి చారలు కలిగిన జంతువు కనిపించింది. దీంతో పెద్దపులిగా భావించిన సాహెబ్ పరుగున గ్రామానికి చేరుకుని గ్రామపంచాయతీ సిబ్బందికి తెలిపాడు. ఈమేరకు సిబ్బంది, గ్రామస్తులు వచ్చి చూడగా జంతువు జాడ లేకపోగా, వారు ఇచ్చిన సమాచారంతో పోలీసులు, అటవీ శాఖాధికారులు వచ్చారు. పొలంలో పాదముద్రలను పరిశీలించి అవి పులివి కావని, హైనా అనే అడవి జంతువు కానీ పెద్ద అడవి పిల్లి గానీ అయి ఉంటుందని నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వేణుమాధవ్, బీట్ ఆఫీసర్లు జ్యోతి, రమేష్, కానిస్టేబుల్ అప్పికట్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి

దండెంపై బట్టలు ఆరవేస్తుండగా ప్రమాదం



సురభి గీత (ఫైల్)

కొణిజర్ల: సంబురంగా హోలీ జరుపుకున్న ఆ కుటుంబంలో గంటల వ్యవధిలోనే విషాదం నెలకొంది. ఉతికిన బట్టలను దండెంపై ఆరవేస్తుండగా విద్యుత్ షాక్ తాకి వివాహిత మృతి చెందడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరైంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు.... మండలంలోని సింగరాయపాలెంకు చెందిన సురభి రాజశేఖర్, గీత(25) దంపతులు ఖమ్మంలో నివాసముంటున్నారు. కొద్దిరోజులుగా రాజశేఖర్ తల్లి ఆరోగ్యం బాగా లేకపోవడంతో వారు ఇద్దరు పిల్లలతో కలిసి ఆదివారం సింగరాయపాలెం వచ్చారు. సోమవారం హోలీ సందర్భంగా బంధువులు, స్నేహితులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. ఆతర్వాత ఉతికిన బట్టలను గీత దండెంపై ఆరవేస్తుండగా తీగకు కరెంట్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురైంది. దీంతో కుటుంబీకులు ఖమ్మం తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. అప్పటి వరకు సంతోషంగా హోలీ ఆడిన గీత మృతి చెందిందనే సమాచారంతో బంధువుల్లో విషాదం అలుముకోగా, ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతదేహాన్ని తరలిస్తున్న అన్నం ఫౌండేషన్ సభ్యులు

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో సోమవారం శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు(30) మృతి చెందాడు. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు నుండి సికింద్రాబాద్ వెళ్తున్న శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలు ఎర్రుపాలెం స్టేషన్‌లో ప్లాట్‌ఫాంపైకి వస్తుండగా, సదరు యువకుడు పట్టాలు దాటుతుండడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పురుగుల మందు తాగిన మహిళ...

తల్లాడ: మండలంలోని బస్వాపురానికి చెందిన మహిళ అనారోగ్యంతో బాధపడుతూ పురుగుల మందు తాగగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. గ్రామానికి చెందిన ఎస్.కె.రంజాన్‌బీ(41) భర్త ఆరేళ్ల క్రితం మృతి చెందగా, ఇద్దరు కుమార్తెల వివాహం జరిపించింది. రెండు నెలల క్రితం ఆమె ఆస్పత్రిలో పరీక్ష చేయించుకోగా కామెర్ల వ్యాధి సోకినట్లు నిర్ధారించారు. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న ఆమె వ్యాధి తగ్గుతుందో, లేదోనన్న బాధతో ఈనెల 18న పురుగుల మందు తాగగా స్థానికులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా, రంజాన్‌బీ సోదరుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కొండల్‌రావు తెలిపారు.

పెనుబల్లి ప్రభుత్వాస్పత్రిలో..



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పెనుబల్లి: పెనుబల్లి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి(50) సోమవారం మృతి చెందాడు. సదరు వ్యక్తి రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 వాహనంలో ఆదివారం సాయంత్రం పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స చేస్తుండగానే ఆయన సోమవారం ఉదయం మృతి చెందాడని వైద్యులు తెలిపారు. కాగా, మృతుడి వివరాలు తెలిసిన వారు సంప్రదించాలని సూచించారు.

పంచాయతీ కార్యాలయంలో చోరీ

అశ్వారావుపేటరూరల్: పంచాయతీ కార్యాలయంలో గుర్తు తెలియని దుండగులు సోమవారం తెల్లవారుజామున చోరీకి పాల్పడ్డారు. మండలంలోని పేరాయిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉన్న స్టోర్‌రూం తాళం పగులగొట్టి నాలుగు పాత మోటార్లు, 11 గేట్ వాల్వ్‌లు, మరో నాలుగు చేతి పంపుల మెటీరియల్‌ను అపహరించారు. చోరీకి గురైన సామగ్రి విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్మూర్తి తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అత్తగారింట్లో గృహోపకరణాలు దగ్ధం చేసిన అల్లుడు

పాల్వంచ: భార్య కాపురానికి రావడం లేదనే కోపంతో ఓ వ్యక్తి అత్తగారింట్లోని గృహోపకరణాలపై పెట్రోల్ పోసి దగ్ధం చేసిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... పట్టణంలోని ప్రియదర్శిని కాలనీకి చెందిన తూము రామారావు కూతురు లక్ష్మికి కొన్నేళ్ల క్రితం అదే ఏరియాకు చెందిన పెద్దిని రోషయ్యతో వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో తరచు గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల లక్ష్మి తల్లిగారింటికి వచ్చి ఉంటోంది. ఈ విషయంపై పలుమార్లు పంచాయితీలు కూడా జరిగాయి. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని రోషయ్య ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో పెట్రోల్ బాటిల్ తీసుకుని అత్తగారింటికి వెళ్లి గృహోపకరణాలపై పోసి నిప్పంటించాడు. డబుల్ కాట్ మంచం, కుర్చీలు, ఫ్రిజ్ ఇతర వస్తువులను దగ్ధం చేయడంతో రూ.80 వేల ఆస్తినష్టం వాటిల్లింది. రామారావు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మర్చిపోయిన బ్యాగు అప్పగింత

ఇల్లెందు: టాటా మ్యాజిక్ వాహనంలో మర్చిపోయిన బ్యాగును తిరిగి ప్రయాణికుడికి అప్పగించారు. మహబూబాబాద్‌లో కీర్తి సమ్మయ్య అనే వ్యక్తి మ్యాజిక్ వాహనం ఎక్కి ఇల్లెందులో దిగి వెళ్లిపోయాడు. తన బ్యాగును వాహనంలోనే వదిలేసి వెళ్లాడు. దీంతో డ్రైవర్ చోటు పోలీసులకు అందజేయగా, సీఐ కరుణాకర్ ఆరా తీసి సదరు ప్రయాణికుడికి అందించారు. ఈ సందర్భంగా డ్రైవర్‌ను సీఐ అభినందించారు.

మద్యం సీజ్

ఇల్లెందు: మండలంలోని రొంపేడు గ్రామానికి చెందిన తాటి శేఖర్ మద్యం విక్రయిస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. బెల్టు షాపులోని మద్యం సీజ్ చేశామని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సందీప్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఇల్లెందు: కోటిలింగాల క్రాస్ రోడ్ వద్ద బైక్ అదుపు తప్పి ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ నెల 23 ముకుందాపురం గ్రామానికి చెందిన శంకర్, తన స్నేహితుడు సాయితో కలిసి బైక్‌పై ఇల్లెందుకు వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. తీవ్ర గాయాలపాలైన శంకర్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రాజారత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా సాయి చికిత్స పొందుతున్నాడు.

వాగులో మునిగి యువకుడు..

కొత్తగూడెంరూరల్: హోలీ ఆడిన తర్వాత రంగులు కడుక్కునేందుకు వాగులో దిగగా, నీట మునిగి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. లక్ష్మీదేవిపల్లి మండలం సాటివారిగూడేనికి చెందిన మోకాళ్ల రాంబాబు, మరో ముగ్గురు యువకులు హోలీ సందర్భంగా రంగులు పూసుకున్నారు. అనంతరం రంగులు కడుక్కునేందుకు వాగులో దిగారు. రాంబాబు (25) బండపై ఉండగా, కాళ్లు జారి వాగులో మునిగి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లక్ష్మీదేవిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

మణుగూరు టౌన్: మండలంలోని సమితిసింగారం పంచాయతీ ఉడతానేని గుంపు ఏరియాలో నివసించే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. డబుల్‌బెడ్రూం ఏరియాలో నివసించే శ్రావణ్(16) తండ్రి బాబు కొంతకాలం క్రితం మృతిచెందాడు. తల్లి కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పూర్తి చేసిన శ్రావణ్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని స్థానికులు తెలిపారు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో సంప్రదించగా, ఫిర్యాదు అందలేదని తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ Complete B.A / B.com / B.Sc / BBA / M.A/M.com / M.Sc / MBA / MCA / B.Tech / Diploma / D.ఫార్మసీ /B.ఫార్మసీ / BAMS / BHMS in 6 months ✆ 95504 43817 [B-190781]

Services

BUSINESS OFFER

■ ద్వారకాఎంటర్‌ప్రైజెస్‌పేపర్ ప్లేట్ & LED మిషన్స్ పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం ఉచిత ముడిపదార్థాలు 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9310515624, 8800496710 [G-1454]

Wanted

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1185002]

■ Work from Home మీ వర్క్ మీరు చేసుకుంటూ రోజుకు 2 లేదా 3గంటలు పనిచేస్తూ నెలకు 25,000+ ఆదాయం సంపాదించే సువర్ణ అవకాశం. సంప్ర।। 8886520724 [G-764]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీ. 18k. ఫోన్: 9640468899 / 9640258899 [H-799856]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, డ్రైవర్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-13624]

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	9705444182
	9010299957
కొత్తగూడెం	9010223783
పాల్వంచ	9705444183
భద్రాచలం	9951602914
మణుగూరు	9705944416
సత్తుపల్లి	9652868642

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.